గల్పిక

# చదువుల సారాంశం

వల్లూరి కృష్ణారావు

సుందర శివరావు ఇంటరు పూర్తిచేయలేక, పరీక్షలకు తాను ఓడిపోయినట్లు ఒప్పందం చేసుకొని, ఇక తాను ఏలాగూ ప్యాసుకాలేనని నిశ్చయం చేసుకొని, ఉద్యోగ ప్రయత్నంమీద పడ్డాడు. పోష్టాఫీసు పరీక్షలకు కట్టాడు గుమాస్తా ఉద్యోగం కోసం! పాపం! తనరాత మంచిదైంది. ఉద్యోగం అయినట్లు అధికార్లనుంచి 'తాఖీదు' వచ్చింది. లేడిలా వెళ్ళి 'జాయిన్' అయ్యాడు కాకినాడ ఆఫీసులో. మొదట్లో తాను ఇంటరు పూర్తి చేయలేనందుకు అంతగా విచారించలేదు. 'పోన్లే ఏదో వందరూపాయల ఉద్యోగం' అనుకున్నాడు ఎవరికో చెబుతున్నట్లు! కాని ఆ ఆఫీసులోనే రిజిస్ట్రేషన్ గుమాస్తా మూర్తిగారు, సార్టింగ్ గుమాస్తా శీతారామయ్యగారు బి. ఏలు కావడం మూలాన తనలోని 'వెలితి' పెద్దదిగా ఇంతై కనబడింది శివరావుకు. ఒకమాటు, మాటల సందర్భంలో వాళ్ళిద్దర దగ్గరాకూడా అన్నాడు.

"నా ఖర్మకొద్దీ ఇంటరు పూర్తిచేసి బి ఏ అనిపించుకోలేక పోయాను ఉద్దేశమున్నా."

మూర్తిగారు, శీతారామయ్యగారు, "మీరు నయం అనుకుంటున్నాం. అనవసరంగా బి. ఏ కని రెండేళ్లు వృథాచేసి రెండు, మూడువేలు తగలెయ్యాలేదు మాలా! గుమాస్తాకు బి. ఏ అయితే ఏం? స్కూలుఫయినల్ అయితే ఏం? ఇదేమయినా బడిపంతులుద్యోగమా!, చదువునుబట్టి సొమ్ములిచ్చేందుకు?" ఏకకంఠంగా అన్నా నచ్చలేదు.

సుందర శివరావు కూడా ఆలోచించాడు కాని తాను 'డిగ్రీ' పుచ్చుకుంటేనే బాగుండునని అనుకున్నాడు, కాలేజినుంచి మిత్రులు వ్రాసే ఉత్తరాలు చదువుకొని బాధపడేవాడు. తన రోడ్డు మీదుగా కాలేజీకి పోయే విద్యార్థులను చూచి మతిపోగొట్టుకొనేవాడు.

రెండేళ్లు గడిచాయి.

తన 'ప్రొబేషన్' పూర్తిఅయి రెండు 'ఇంక్రిమెంట్లు' తీసుకున్నా తనకేదో ఇంకా వెలితిగానే ఉన్నట్లు 'ఫీల'య్యాడు ఎలాగయినా తాను బి. ఏ అనిపించుకోవాలని మళ్ళీ 'గ్రూపు' మార్చి పరీక్షకు కూర్చోవాలని పుస్తకాలు కొన్నాడు.

ఏడాది తిరిగింది...

సుందర శివరావు మళ్ళీ తప్పాడు 'గ్రూపు' మార్చినా. ఆస్థానమార్పు మానవుణ్ణి అదృష్టవంతుణ్ణి చేస్తుందని విని ఉంటాడు సుందరశివరావు. ఇక్కడ 'గ్రూపు' మార్పు తన పరీక్ష మార్పు తెస్తుందని అతని భావనయి ఉండచ్చు! దెబ్బతిన్న త్రాచులా మళ్ళీ చదువుతున్నాడు.

గోపాలం ట్రయినింగు పూర్తిచేసి టవున్ హైస్కూల్లో చేరాడు. గోపాలం సుందరశివరావుతో అన్న మొదటి మాటలు సుందరశివరావుని చకితుణ్ణి చేసాయి.

"నువ్వు అదృష్టవంతుడివిరా శివం! సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగం."

సుందర శివరావు కనురెప్పలు చికిలించాడు. తాను అదృష్టవంతుడా? ఇంటరు పూర్తిచేయలేని తను?

సుందర శివరావును దిగ్భ్రాంతుణ్ణి చేసింది సదానందం ఉత్తరం.

"ఏమో అనుకున్నాను నిజంగా నువ్వే తెలివైన వాడివి. బి. ఎ. ప్యాసయి నే చేసిందేముంది?... ఈ పోష్టాఫీసు గుమాస్తేగా? ఇంటరు చదివిననువ్వూ అంతే! ఇంకా నువ్వు నాకంటె రెండేళ్ళు 'సీనియర్' అని మర్చిపోకు. నువ్వు బి. ఎ. చదవక పోవడంవల్ల మూడువేల నగదు, రెండేళ్ళు కాలం నీవు 'డిపాజిట్టు' చేసుకున్నావు. కాకతాళీయంగా నీ ఇంటరు పోవడమే అనుకో నీ ఈ 'సీనియారిటీ'కి గల కారణం... సదానందం."

సుందరశివరావు ఇంటరుపరీక్ష పేరెత్తలేదు. ★